ఇంటికన్నా, గుడి పదిలం

# నాలుగేళ్ల తరవాత-

బి వెంకటేశ్వరరావు

కాఫీతాగేశా. అర్థరూపాయి బిల్లు చేతికిచ్చాడు సర్వరుగారు. కౌంటరు దగ్గరకొచ్చి పర్సు చూసుకుంటే ఆరణా లేవుంది. మర్యాదగాచెప్పేశా బేడ సాయంత్రం యిస్తా లెండని...'నీ బాబుగారి సొమ్మని తిన్నావాయేం?' అన్నాడయ్యరు...అంత నీచంగా తీసిపారేసినందుకు సహించలేపోయా... అదే కోట్టటం కొట్టా...చెప్పలేను ఎన్ని దజన్లుపడి పోయాయో... దాని ఫలితంగా నాలుగేళ్లు శ్రీ కృష్ణజన్మస్థానం ప్రాప్తించింది.

కష్టాన్నన్న ప్రాణాన్ని సుఖాన్ని పడేశా ననుకున్నా...రామా కృష్ణా అంటూ గడిపేశా జైల్లో కాలాన్ని...195 ` వచ్చేసింది...జైల్లో నా బట్టల్ని. బూజులు దులిపేసి, వేసుకున్నా- ఇంటి దగ్గర్నుంచి తెప్పించుకున్న పదిరూపాయలు జేబులో వేసుకు బయల్దేరా మామూలు ప్రపంచంలోకి...

బజార్లోంచి నడుస్తున్నా...అద్దంలో నా ముఖంచూచుకు చాలా అసహ్యించుకున్నా... మాసినగెడ్డం ... దుబ్బులా పెరిగింది తల... పక్కనే వున్న రంగూన్ సెలూన్‌లోకి కాలు పెడుతూంటే నా వాలకంచూచి యిక్కడేంలేదు పో అన్నాడు మంగలి మహాశయుడు...మన రోజులిలా వున్నాయనుకుని జేబులో పదిరూపాయలనోటు బయటికితీశా...

మంగలిముఖం మతాబా వెలిగించేసింది... 'క్షమించండిబాబూ' అంటూ లోపలికి ఆహ్వానించాడు...ఫాన్ వేసి, రేడియో ట్యూన్‌చేసి ఆయుధాల్తో తయారయాడు...దోసిలినీళ్లు నెత్తి మీదపోసి తలకత్తిరించడానికి మొదలుపెట్టాడు రెండు దువ్వెనలు విరగ్గొట్టుకున్నాక.

ఆ ఫర్నిచరు, అద్దాలు, రేడియో...యివన్నీ చూచి నాలుగు సంవత్సరాల క్రిందవున్న దరిద్రం అంతా పోయిందేమో అనుకున్నా ... తలకాయను అటుతిప్పి యిటుతిప్పి చెవిపట్టుకుని....ఇంకా యిలా చాలాసేపు తంటాలుపడి మొత్తానికి అయిందనిపించాడు.

పదిరూపాయల కాగితం చేతికిచ్చా...ఎనిమిదిన్నర తిరిగిచ్చాడు ..క్రాపుచేసి గెడ్డం చేసినందుకు రూపాయిన్నరా అని ఆశ్చర్యపడి- పొరపాటున తప్పు లెక్కపెట్టానేమోనని మళ్ళీ లెక్కపెట్టా ... మళ్ళీ ఎనిమిదిన్నరే.

క్రాపు రూపాయిన్నరా?' అన్నా చిరునవ్వుతో. అవునని సమాధానం...ఇంకా తటపటాయిస్తూంటే 'మీరు ఎక్కడన్నా కనుక్కోండి సార్' అన్నాడు...నా గెడ్డం పెరిగిపోయినట్టే పెరిగిపోయింది వీళ్ళ రేటనుకున్నా...ఒక్క అణా లేడావున్నా వాడిభరతం పట్టెయ్యాలనుకున్నా.

ముందుకుసాగా...మళ్ళీ అయ్యరు హోటల్లోకి కాళ్ళీడ్చుకుపోయాయి నన్ను...నాలుగేళ్ళ నుంచి సాంబారిడ్లీ లేక జిహ్వ చచ్చిపోయిందేమో తెగ తిన్నా ...సర్వరు తెల్లబోతున్నాడు...బహుశా నాలా తినే వ్యక్తిని చూడటం అతనికి మొదటి సారేమో.

కాఫీ యిచ్చి బిల్లు టేబుల్ మీద పడేశాడు. ...బిల్లుమీద నాకళ్లుపడ్డాయి...రెండున్నర .. ఇంకేముంది ...మిగిలిన కాఫీని త్రాగలేకపోయా.

'ఇడ్లీ ఎంత?' అన్నా...నాలుగు సాంబారిడ్లీ ఒక రూపాయి, రెండు పూరీ అర్థరూపాయి, రెండు పెసరట్లు అర్థరూపాయి... కాఫీ స్పెషల్ అర్థ రూపాయి.

తడుముకోకుండా బిల్లు చెప్పేశాడు ?...... నెత్తిమీద పిడుగుపడిందనిపించింది ... నాలుగేళ్ల క్రింద అణా యిడ్లీ యిప్పుడు పావలా ...కాఫీ స్పెషల్ అర్థరూపాయి ... అది మానవుల కాఫీ హోటలేనా అనిపించింది.

మాట్లాడకుండా బిల్లుచెల్లించి బయటకొచ్చేశా. 'గోల్డుఫ్లేక్ సిగరెట్టు పెట్టొకటియ్యి!' అన్నా కిల్లీషాపువాణ్ణి......నేషనల్ గోల్డుఫ్లేక్, సావరిన్ గోల్డుఫ్లేక్, లండన్ గోల్డుఫ్లేక్...యిన్ని రకాలున్నాయి ఏదికావాలి సార్, అన్నాడు.

ఇన్నిరకా లెక్కణ్ణించి పుట్టాయిరా దేవుడా అనిపించింది. లండన్ గోల్డుఫ్లేక్ యివ్వమన్నా...

పదిరూపాయల కాయితం మారిస్తే వూరికే యిలా ఎవాపరేటయిపోతూందేమి అని ఆశ్చర్యపడుతూ రూపాయి కాయితం చేతికిచ్చి యింకా చెయ్యి చాపి నుంచున్నా.

డబ్బివ్వడం మరిచిపోయాడేమో అని మిగతా చిల్లరివ్వమన్నా ... వాడు తెల్లపోయాడు ... సిగరెట్టు సన్యాసం కంటిన్యూచేస్తేనే మంచిదేమో అనిపించింది.

'కిల్లీ ఎంత?' అన్నా, ముందుధర తెలుసుకుంటే మంచిదని...'పావలా సార్'...అన్నాడు. కిల్లీషాపువాలా వినిపించీ వినిపించకుండా ...... ఒద్దుబాబు అని బయల్దేరా ...' ఏ అడవిలోంచయినా దారితప్పి వొచ్చాడేమో' అంటున్నాడు.

ముందుకు సాగా...నాలుగేళ్ళ క్రితం జైల్లోకి నన్ను తీసుకెళ్లేప్పుడు ఆవూళ్లో చాలా డాబాలున్నట్టు జ్ఞాపకం. ఇప్పుడన్నీ కనీసం ఆరేసి అంతస్తులు లేచిపోయాయి.

ప్రపంచం చాలా కొత్తగావున్నట్టు కనిపించింది...అంతా ఖద్దరు దుస్తులు, గాంధీ టోపీలు ధరించినవారే ... నేనే దిష్టిపిడతలా నాజూకు గుడ్డలు వేసుకున్నవాణ్ణి. 'అయితే కోటాగుడ్డలు యిప్పుడసలు దొరకవు కాబోలు' అనుకుంది హృదయం.

నాలుగురోడ్ల జంక్షన్‌లోకి పోయా... ఆడ పోలీసును చూచి విస్తుపోయి నుంచున్నా ... జైల్లో మాత్రం మొగపోలీసులే ... పక్కనే టౌన్ పోష్టాఫీసు బోర్డు కనిపిస్తే వాళ్ళకీ వీళ్ళకీ వుత్తరాలు రాద్దామనిపించింది ... తీరా చూస్తే అందులో కూడా అంతా ఆడవాళ్లే ...కొంపతీసి యిది ఆడవాళ్ళకు ప్రత్యేక పోస్టాఫీసా అనుకున్నా.

'ఏంకావాలండీ' అంది ఓ గుమస్తా ... 'రెండు కవర్లు నాలుగు కార్డులు' యిమ్మని అయిదు రూపాయల నోటిచ్చా ...అడిగినవిస్తూ నాలుగు రూపాయలు చేతిలోపెట్టింది. తెల్లబోయి చూస్తూంటే ...యింకా ఏం కావాలంది ... కవరెంత కార్డెంత అంటే ముందు పావలా వెనకది బేడట. 'వద్దులెండి' అని కవర్లు కార్డులు యిచ్చేశా... 'కార్డు కానీ,కవ రర్థణా అనుకున్నారా?...మీరు కొత్తగా ఎక్కణ్ణించో దిగొచ్చేరులా వుంది...' అని విసుక్కుంటూ నా కాయితం నా కిచ్చేసింది. చాలమందికి నేను బతికున్నట్టు తెలీదు. పోనీ వుత్తరాలే రాద్దామంటే వున్నడబ్బు కాసా వుత్తరాలకయ్యేలా వుంది...ఉత్తరాలు రాయకపోతే మరేం పర్వాలేదనుకుని పోస్టాఫీసులోంచి బయటపడ్డా.

మొగాళ్లంతా వంటలు, ఆడవాళ్లు వుద్యోగాలు చేస్తున్నారేమో అనుకున్నా. సిటీ బస్సెక్కితే అందులో ఎక్కా...డ్రైవరు కండక్టరు ఆడవాళ్లే...కారు మహాజోరుగా పోతూంది... దేన్నయినా ఢీకొట్టదుగదా అనిపించింది...

మా ఆవి డేం వుద్యోగం చేస్తూందో అని వూహించడం మొదలెట్టా ... 'దిగవయ్యా'... అంది అధికారస్వరంతో కండక్ట్రెస్...దిక్కపోతే కొడుతుందేమోనని దిగిపోయా... పెద్ద లౌడ్‌స్పీకర్‌లోంచి రికార్డులు వినిపిస్తున్నాయి... ప్రశాంతంగాకాస్సేపు సినీమా చూద్దామనుకున్నా... పిక్చరేమిటయ్యా అంటే 'సీత అప్పగింతలు' టెక్నికలర్లోనట...ఈ పౌరాణికాలు యింకా మానవుల్ని వదల్లేదు...అందులో టెక్నికలర్‌లోకూడా వస్తున్నాయి...పోనీ చూద్దాంలే అని రెండు రూపాయలనోటు బుక్కింగ్ కిటికీలో పెట్టి 'ఓ ఫస్టు క్లాస్' అన్నా...

'ఏవూరుమంది?' అన్నాడు బుక్కింగ్ ఆసామి. బలేకోపంవొచ్చి ఎందుకన్నా ... 'ఫస్టుక్లాసు పాతిక - లాస్టుక్లాసు అయిదు'...ఇంకేం బాగానే వున్నాయి రేట్లని తిరుగుముఖం పెట్టా...

బుర్రచాలా వేడెక్కింది...ప్రపంచంలో మానవులు ఈ రేట్లు యిలా వున్నా ఎలా జీవిస్తున్నారనిపించింది...ఒకవేళ అందరిజీతాలు వెయ్యిపైన వున్నాయా అని అనుమానం.

ఆకలేస్తే అయ్యరు హొటల్లో ఎట్టటి కంపుకొట్టే అన్నాన్ని ముక్కూ కళ్లూ మూసుకు తిన్నా ... జైలుకూడే మెరుగనిపించింది ... కౌంటరు దగ్గరకొచ్చి జేబులో చెయ్యిపెడితే చెయ్యి లోపలకి పోతూంది,...జేబు ఖాళీ... అయ్యరుతో మనవిచేశా...'అయిదు రూపాయిలు నీ అబ్బయిస్తాడా' అన్నాడు వురుముతూ ... లాగి నాలుగుకొట్టేసరికి మంచి నీళ్ళడక్కుండా పడ్డాడు కింద...చేసిన నేరం మళ్లా చేశాకాబట్టి ఎనిమిదేళ్ళజైలు...బ్రతుకు జీవుడా అని మళ్లీ నా మామూలు స్వర్గానికి పోయా—